
సాక్షి సిద్దిపేట

సోమవారం । 28 । ఆగస్టు । 2023


సీఎం కేసీఆర్


కోమటి చెరువు కేబుల్ బ్రిడ్జి


మంత్రి హరీశ్‌రావు

న్యూస్‌రీల్

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయండి


మాట్లాడుతున్న జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాంరెడ్డి

దుబ్బాక: రాష్ట్ర ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఐదేళ్లు గడుస్తున్నా నేటికీ కార్యరూపం దాల్చడంలేదని రెడ్డి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అప్పమ్మగారి రాంరెడ్డి మండిపడ్డారు. ఆదివారం దుబ్బాక పట్టణంలో రెడ్డి సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రెడ్డి జేఏసీ నాయకులు మాధవరెడ్డి, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, బాల్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, తదితరులున్నారు.

మారథాన్‌లో సిద్దిపేట రన్నర్స్


హైదరాబాద్ మారథాన్ రన్‌లో పాల్గొన్న సీపీ శ్వేత, పోలీసు అధికారులు

సిద్దిపేటకమాన్: హైదరాబాద్ గచ్చిబౌలిలో ఆదివారం నిర్వహించిన మారథాన్ రన్‌లో సిద్దిపేట సీపీ శ్వేత, పోలీసు అధికారులు, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. మారథాన్‌లో పాల్గొన్న వారికి మెడల్స్ ప్రదానం చేశారు. 42కే రన్‌ను రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఉపాధ్యాయుడు రవి పూర్తి చేయగా, 21కే రన్‌లో పోలీసు అధికారులు, సిబ్బంది, రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సిద్దిపేటలో కూడా 10వేల మందితో ఆఫ్ మారథాన్ సెకండ్ ఎడిషన్ నిర్వహించుకుందామని తెలిపారు. రన్‌లో పాల్గొన్న వారిని సీపీ అభినందించారు.

ముదిరాజ్‌లకు తీరని అన్యాయం

- ఐక్య పోరాటాలే శరణ్యం
- ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సురేశ్


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సురేశ్

జగదేవ్‌పూర్(గజ్వేల్): ముదిరాజ్‌లకు రిజర్వేషన్ అవకాశం కల్పించాలని, బీసీ డీ నుంచి బీసీ ఏకు మార్చాలని ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సురేశ్ అన్నారు. ఆదివారం జగదేవ్‌పూర్‌లో ముదిరాజ్ సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా బైక్‌లతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ ముదిరాజ్‌లకు అన్ని రకాలుగా అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చట్ట సభలో ముదిరాజ్‌లు వెళ్లాలని, ఆదిశగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. జనాభా ప్రకారం ముదిరాజ్‌లకు ఎమ్మెల్యే స్థానాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జగదేవ్‌పూర్ గ్రామ ముదిరాజ్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోనమైన బాలయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రాజు, యూత్ ఆధ్యక్షుడు సురేష్, మహిళా అధ్యక్షురాలు జయమ్మ, ముఖ్య సలహాదారుడు బలరాం, సర్పంచ్‌లు, రాజు, భిక్షపతి, చంద్రం, వివిధ గ్రామాల నాయకులు కొండయ్య, కరుణకర్, మహేష్, బాలకిసాన్, రతన్, నర్సింహులు పాల్గొన్నారు.

మెగా డ్రోన్.. అదిరెన్


డ్రోన్ షోను తిలకిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తదితరులు


గీతాలు ఆలపిస్తున్న సింగర్ మాధురి





సిద్దిపేటలోని కోమటిచెరువుపైన ఆదివారం రాత్రి నిర్వహించిన మెగా డ్రోన్ షో అబ్బురపరిచింది. 450 డ్రోన్లతో అభివృద్ధిని నింగిలో ప్రదర్శించారు. అద్భుతంగా.. కనువిందుగా సాగింది. డ్రోన్ షో ద్వారా ప్రగతిని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. సుమారు 20 నిమిషాల పాటు షో కొనసాగింది. రంగనాయక సాగర్, సిద్దిపేట లాల్ కమాన్‌తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను డ్రోన్ షో ద్వారా ప్రదర్శించారు. మంత్రి హరిశ్‌రావు తన సతీమణి శ్రీనిత తో కలిసి షో వీక్షించారు. ఈ వేడుకలకు రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ గాయకురాలు గీతా మాధురి ఆలపించిన పాటలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ వేడుకను వీక్షించేందుకు వేలాది మంది తరలించారు. ఈ సందర్భంగా ఈట్ రైట్ మేళాను మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. పలు స్టాళ్లను పరిశీలించారు. – సిద్దిపేటజోన్


మెగాడ్రోన్ షోను తిలకిస్తున్న ప్రజలు

సోలిపేట.. ఎటు బాట!

నిన్నటి దాక ఆ కుటుంబం దుబ్బాకకు పెద్ద దిక్కు.. ఇప్పుడు ఎవరూ లేని అనాథ.. నమ్ముకున్న పార్టీ దూరం పెట్టింది. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ కార్యకర్తలు, అనుచరుల ఒత్తిడి పెరుగుతుండటంతో మరో రాజకీయ పార్టీలో చేరి సత్తా చూపాలని ఆ కుటుంబం నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఆ దిశగా అడుగులు వేస్తోంది. త్వరలో వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిలతో భేటీకి రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

సందిగ్ధంలో కుటుంబం

- నిర్ణయం తీసుకోవాలంటూ కార్యకర్తల ఒత్తిడి
- నేటివరకు సంప్రదించని బీఆర్‌ఎస్ అధిష్టానం
- షర్మిలతో భేటీకి ఓ సీనియర్ జర్నలిస్టు మంత్రాంగం
- దుబ్బాకలో జోరుగా చర్చ


సోలిపేట రామలింగారెడ్డి సతీమణి సుజాత, కుమారుడు సతీష్‌రెడ్డితో అనుచరులు, కార్యకర్తలు (ఫైల్)

దూరం పెడుతున్న పార్టీ!

దుబ్బాకటౌన్: దుబ్బాక నియోజకవర్గం నుంచి సోలిపేట రామలింగారెడ్డి దుబ్బాక నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఉప ఎన్నికల్లో గెలిచారు. ఆయన స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందిన తర్వాత అప్పటి నుంచి క్రమంగా సోలిపేట కుటుంబాన్ని పార్టీ దూరం పెడుతూవచ్చింది. అయినప్పటికీ దివంగత నేత రామలింగారెడ్డి సతీమణి సుజాత, కుమారుడు సతీష్‌రెడ్డి నియోజకవర్గంలో పర్యటిస్తూ కార్యకర్తలు, ప్రజలతో మమేకమై వస్తూనే ఉన్నారు. 8 నెలల క్రితం మంత్రి హరీశ్‌రావు సోలిపేట సతీష్‌రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిలను సీఎం కేసీఆర్ వద్దకు తీసుకెళ్లారు. ఆ సమయంలో కలిసి పనిచేయాలని సీఎం సూచించారు. టికెట్ల కేటాయింపు జరిగే వారం రోజుల ముందే మంత్రి స్వయంగా సిద్దిపేటలోని రామలింగారెడ్డి ఇంటికి వెళ్లి సుజాతమ్మ, సతీష్‌రెడ్డితో చాలా సేపు మాట్లాడారు.

మరణం అనంతరం ఆయన కుటుంబానికి టికెట్ ఇచ్చే అంశంపై బీఆర్‌ఎస్ రెండుగా చీలిపోయింది. ఒక వర్గం సోలిపేట కుటుంబానికి మద్దతుగా, ఇంకో వర్గం వ్యతిరేకంగా సభలు సమావేశాలు నిర్వహించారు. మంత్రి హరీశ్‌రావు పట్టుబట్టి ఉప ఎన్నికల్లో రామలింగారెడ్డి సతీమణి సుజాతమ్మకు టికెట్ ఇప్పించారు. ఆమె గెలుపు కోసం తీవ్రంగా కృషి చేశారు. నియోజకవర్గంలో బలంగా ఉన్న బీఆర్‌ఎస్ గెలుపు నల్లేరుపై నడకనే అనుకోగా అనూహ్యంగా బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు కేవలం వెయ్యి ఓట్ల స్వల్ప తేడాతో సుజాత ఓటమిచెందారు. అప్పటి వరకు బలంగా ఉన్న బీఆర్‌ఎస్ ఓటమి వెనుక సొంత పార్టీ నేతలే కారణమన్న ఆరోపణలు వినిపించాయి. సొంత పార్టీ నేతల కదలికలను పసిగట్టలేకనే ఓటమి చెందినట్లు ఉప ఎన్నికల తర్వాత అధిష్టానం గుర్తించి దిద్దుబాటు చర్యలపై దృష్టి పెట్టింది.

షర్మిల దృష్టికి..

తాజాగా దుబ్బాక బీఆర్‌ఎస్ టికెట్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి కేటాయించిన నేపథ్యంలో.. సోలిపేట కుటుంబం రాజకీయ భవిష్యత్తును వెతుక్కునే పనిలో పడింది. తమను ఏ మాత్రం సంప్రదించకుండా, తమ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా ప్రభాకర్‌రెడ్డికి టికెట్ కేటాయించడంతో సోలిపేట కుటుంబం మానసిక ఆందోళనకు గురైంది. దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కూతురు షర్మిల పెట్టిన వైఎస్సార్‌టీపీ వైపు సోలిపేట కుటుంబం అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు సోలిపేట కుటుంబంతో అత్యంత సన్నిహితంగా ఉండే సీనియర్ జర్నలిస్టు ఒకరు ఇరువురిని కలిపే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే షర్మిలను కలిసిన సదరు జర్నలిస్టు రామలింగారెడ్డి కుటుంబ నేపథ్యం, ఆడబిడ్డగా సుజాతమ్మకు జరిగిన అన్యాయం, నియోజకవర్గం మీద ఆ కుటుంబానికి ఉన్న పట్టు వివరించినట్లు తెలిసింది. ఇదే అంశాన్ని సుజాతమ్మ, సతీష్‌రెడ్డితో సైతం చర్చించినట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీతో షర్మిల పొత్తు లేదంటే.. విలీనం దాదాపుగా ఖరారైనట్లు తెలుస్తోంది. వైఎస్సార్‌టీపీ నిర్వహించిన సర్వేలో రాష్ట్ర వ్యాప్తంగా 20 స్థానాల్లో బలంగా ఉన్నట్లు అందులో 10 చోట్ల విజయావకాశాలు మెండుగా ఉన్నట్లు వినికిడి. ఈ నేపథ్యంలోనే షర్మిల దుబ్బాక నియోజకవర్గంపై ఫోకస్ పెట్టినట్లు సమాచారం. సోలిపేట కుటుంబం భవిష్యత్తు కార్యాచరణ ఏలా ఉంటుందన్న అంశంపైనే నియోజకవర్గంలో జోరుగా చర్చ జరుగుతోంది.

హ్యాట్రిక్ సీఎంను చేద్దాం

సిద్దిపేట ప్రజలు మంచోళ్లు

- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: సిద్దిపేట ప్రజలు చాలా మంచోళ్లు.. అన్నం పెట్టే సీఎం కేసీఆర్‌ను మరిచిపోవద్దు. మూడోసారీ సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించి హ్యాట్రిక్ సీఎంను చేద్దామంటూ రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం కొండా భూదేవి గార్డెన్స్‌లో పంచాయతీ కార్యదర్శులకు క్రమబద్ధీకరణ పత్రాలతో పాటు ఆసరా పెన్షన్ల ప్రొసీడింగ్‌లను అందజేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలో దివ్యాంగులను గుర్తించి వారిలో ఆత్మవిశ్వాసం కలిగించిన నాయకుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. రాష్ట్రంలో 5.5 లక్షల మంది వికలాంగులకు ఆసరా పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. బీడీ టేకేదారులకు రూ. 2,016 చొప్పున ఆసరా పింఛన్లు ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 167 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరణ చేశామని.. మరో 11 మందికి త్వరలోనే చేస్తామన్నారు. అంతకు ముందు పట్టణంలో పలు సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమాలలో ఎంపీ ప్రభాకర్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, కమిషనర్ సంపత్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

కలిసి పని చేద్దాం..

నియోజకవర్గ అభివృద్ధికి కలిసి పనిచేద్దామని మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు అతీక్, సజ్జు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా వారిని పార్టీలోకి ఆహ్వానించారు. సిద్దిపేట పట్టణంలో 2,600 డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చామని.. అందులో 650 ఇళ్లను ముస్లిం కుటుంబాలకు అందజేసినట్లు తెలిపారు. మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం నూతన, ప్రాచీన ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తుందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలోని చిన్నకోడూర్ మండలం సలేంద్రి గ్రామంలో పురాతన ప్రాచీన శివాలయానికి రూ. 50 లక్షలు, విఠలాపూర్‌లో చరిత్ర కలిగిన విఠలేశ్వర స్వామి ఆలయానికి రూ. 42 లక్షలు, నారాయణరావుపేట మండలంలోని పురాతన ఆలయం బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయానికి రూ. 39 లక్షలు, సిద్దిపేట పట్టణంలోని పెద్దమ్మ దేవాలయానికి రూ. 30 లక్షలు, ఇర్కోడ్ పెద్దమ్మ ఆలయానికి రూ. 20 లక్షలు, సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలోని మహంకాళీ దేవాలయానికి రూ. 17.50 లక్షల నిధుల మంజూరు పత్రాలను ఆదివారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో అర్చకులు, నిర్వాహకులకు అందజేశారు.


మంత్రి హరీశ్‌రావుతో సెల్ఫీ తీసుకుంటున్న ప్రజలు

సత్వర న్యాయమే లక్ష్యం

- దుబ్బాకలో అన్ని సౌకర్యాలతో కోర్టు భవన నిర్మాణం
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురాం

దుబ్బాకటౌన్: అందరికీ సత్వరం న్యాయం అందించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురాం తెలిపారు. ఆదివారం దుబ్బాకలో జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు కార్యాలయ భవన నిర్మాణం కోసం కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ త్వరలోనే కోర్టు భవనాన్ని అన్ని సౌకర్యాలతో నిర్మించనున్నట్లు తెలిపారు. తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద స్థలాలు అనుకూలంగా ఉండటం గమనించి తహసీల్దార్, సర్వేయర్ కు సూచించారు.


కోర్టు భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రధాన న్యాయమూర్తి రఘురాం, కలెక్టర్

త్వరితగతిన కోర్టు భవనం నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో దుబ్బాక సివిల్ కోర్టు జడ్జి చందన, తహసీల్దార్ జయంత్, ఎంపీడీవో భాస్కర్‌శర్మ, సీనియర్ న్యాయవాదులు తదితరులు ఉన్నారు.

భైరాన్‌పల్లి చరిత్రను గుర్తించాలి

- జలియన్‌వాలాబాగ్‌ను మించిన ఘటన
- మాజీ రాజ్యసభ సభ్యుడు రాపోలు

మద్దూరు(హుస్నాబాద్): జలియన్‌వాలాబాగ్‌కు మించిన చరిత్ర భైరాన్‌పల్లికి ఉందని మాజీ రాజ్యసభ సభ్యుడు రాపోలు ఆనందభాస్కర్ అన్నారు. ఆదివారం దూళ్మిట్ట మండలం భైరాన్‌పల్లిలో రజాకర్ల దాడిలో అమరులైన 118 మందిని స్మరిస్తూ వారి పేరున తర్పణం, శాంతి, పితృయజ్ఞం నిర్వహించారు. బురుజు వద్ద అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో బలిదానం తర్వాతే తెలంగాణ ప్రాంతం భారతదేశంలో కలిసిందన్నారు. ఇంత గొప్ప చరిత్ర కలిగిన భైరాన్‌పల్లికి ఎక్కడా సరైన గుర్తింపు లేదన్నారు. ఇక నుంచైన చైతన్యవంతులు చరిత్ర భావితరాలకు తెలియజేసేందుకు ముందుకు రావాలన్నారు. భైరాన్‌పల్లి అమరులకు గౌరవ సంస్కరణ సభ జరపాలని ఆయన అన్నారు. అనంతరం సమరయోధుల కుటుంబాలను ఆయన సన్మానించారు. అంతకుముందు బెక్కల్ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బురుజు వద్దకు వస్తున్న రాపోలును స్థానిక యువకులు అడ్డుకున్నారు. మీరు ఇచ్చిన హామీలుఏమయ్యాయని ప్రశ్నించారు. మూడు సంవత్సరాల నుంచి ఆనంద్ భాస్కర్ వస్తున్నారే తప్ప గ్రామా అభివృద్ధికి చేసింది ఏమీ లేదన్నారు. గ్రామంలో 118 మంది అమరులైన కుటుంబాలకు ఎలాంటి సమాచారం లేకుండా పిండ ప్రదాన కార్యక్రమం ఎలా చేస్తారని వారు ప్రశ్నించారు. గొప్ప చరిత్ర కల్గిన భైరాన్‌పల్లి ని ఓటు బ్యాంక్ రాజకీయాల కోసమే మాత్రమే వాడుకుంటున్నారని మండిపడ్డారు. వెంటనే సీఐ జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు.


బురుజు వద్ద సమరయోధుల కుటుంబాలతో కలిసి నివాళులర్పిస్తున్న రాపోలు

హుస్నాబాద్ స్టీల్ బ్యాంక్ తెలంగాణకే ఆదర్శం

- మెప్మా అధికారులకు సీడీఎంఏ అభినందనలు


హుస్నాబాద్ పట్టణంలో స్టీల్ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో హుస్నాబాద్ పట్టణంలో నెలకొల్పిన స్టీల్ బ్యాంక్ తెలంగాణకే ఆదర్శంగా నిలిచింది. హుస్నాబాద్ పట్టణంలో శనివారం పట్టణ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంక్‌ను ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ప్రారంభించారు. స్టీల్ బ్యాంక్ నెలకొల్పడాన్ని సీడీఎంఏ పమేలా సత్పతి మెప్మా అధికారులు, సిబ్బందిని అభినందించారు. హుస్నాబాద్ పట్టణాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రతి జిల్లా కేంద్రంలో, మున్సిపల్ పట్టణాల్లో స్టీల్ బ్యాంక్‌ను ఏర్పాటు చేయాలని సీడీఎంఏ ఆదేశించారు. టీఎల్ఎఫ్ (టౌన్ లెవల్ ఫెడరేషన్) అప్రూవల్ తీసుకొని స్టీల్ బ్యాంక్ ప్రాముఖ్యత వివరించి, స్టీల్ బ్యాంక్‌ను ఏర్పాటు చేసేందుకు ఏ మహిళా సంఘం ముందుకు వస్తుందో సోమవారం సాయంత్రం లోగా వివరాలు పంపించాలన్నారు. హుస్నాబాద్ పట్టణ స్టీల్ బ్యాంక్ ఆదర్శంగా నిలిచినందుకు జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ హన్మంతరెడ్డి, హుస్నాబాద్ టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ ముత్యాల రాజుకు సీడీఎంఏ అభినందనలు తెలిపారు.

కొమురవెల్లికి పోటెత్తిన భక్తులు


కొమురవెల్లి మల్లన్న ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ పరిసరాలన్నీ మల్లన్న నామస్మరణతో మారుమోగాయి. భక్తులు అభిషేకాలు, పట్నాలు, ఒడిబియ్యం, అర్చనలు, కేశఖండన, గంగిరేణి చెట్టుకు ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కొండ పైన రేణుక ఎల్లమ్మ తల్లికి బోనం సమర్పించి చల్లంగా చూడు తల్లి అంటూ వేడుకున్నారు. స్వామి వారి దర్శనానికి సుమారు 2 గంటల సమయం పట్టింది. ఏర్పాట్లను ఏఈవో అంజయ్య, ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్‌లు పర్యవేక్షించారు. –కొమురవెల్లి(సిద్దిపేట)

కనులపండువగా వేంకటేశ్వరుడి రథోత్సవం

దుబ్బాక: శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ రెండో వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన ఆదివారం రాత్రి పద్మావతి, అలివేలు మంగ సమేత వెంకటేశ్వర స్వామి రథోత్సవ ఊరేగింపు కన్నులపండువగా సాగింది. భక్తుల కోలాటాలు, డప్పు వాయిద్యాలు, నృత్యాల నడుమ.. భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. కార్యక్రమంలో ఆలయ బాధ్యుడు వడ్లకొండ శ్రీధర్, వేణు. చింత రాజు, తదితరులున్నారు.

స్వామిని దర్శించుకున్న జిల్లా జడ్జి

జిల్లా జడ్జి రఘురాం కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ బాధ్యులు ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామికి పూజలు చేశారు. కార్యక్రమంలో దుబ్బాక ప్రథమ శ్రేణి న్యాయమూర్తి చందన, తదితరులున్నారు.


స్వామివారి ఊరేగింపు


బోనాలతో మహిళల కోలాటం

క్లుప్తంగా

'కుమ్మరులు సంఘటితంగా ఉండాలి'

చిన్నకోడూరు(సిద్దిపేట): కుమ్మరులు సంఘటితంగా ఉండి తమ హక్కులు సాధించుకోవాలని కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షుడు దరిపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం చిన్నకోడూరులో మండలస్థాయి సంఘ సమావేశానికి హాజరై మాట్లాడారు. ఐకమత్యంగా ఉండి సంఘం బలోపేతానికి కృషి చేయాలని పేర్కొన్నారు. మంత్రి హరీశ్‌రావు సిద్దిపేట పట్టణంలో మట్టిపాత్రల తయారీ కేంద్రానికి రెండెకరాలు కేటాయించి నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి భగవాన్, నాయకులు తిరుపతి, రవీందర్, భూమయ్య, సురేష్, బాలకిషన్, రమేష్, మధు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో సత్తాచాటుతాం



పార్టీలో చేరిన వారితో శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక: రానున్న ఎన్నికల్లో విజయం సాధించి కాంగ్రెస్ సత్తా చాటుతామని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం దుబ్బాక కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో చేగుంట మండలం పులిమామిడికి చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరగా వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలకు ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లం, రాజశేఖర్, రమేష్, పోచయ్య, కుమార్, బాలమల్లు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



బ్రిడ్జిపై నూతనంగా వేసిన తారు రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..

దుబ్బాక: ఇటీవల 'మట్టి రోడ్డుతో తప్పని తిప్పలు' అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి కాంట్రాక్టర్ స్పందించారు. దుబ్బాక నుంచి లచ్చపేట వెళ్లే ప్రధాన మార్గంలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. నిర్మాణం పూర్తయ్యాక మట్టి రోడ్డు వేయడంతో వర్షానికి రోడ్డంత బురదమయమై వాహనదారులు తీ వ్ర ఇబ్బంది పడ్డారు. స్పందించిన కాంట్రాక్టర్ బ్రిడ్జిపై తారు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు.

పరామర్శ



దేవేందర్‌రెడ్డిని ఓదారుస్తున్న మంత్రి హరీశ్‌రావు

కొండపాక(గజ్వేల్): డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డిని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు. దేవేందర్‌రెడ్డి తల్లి లక్ష్మి శనివారం మృతి చెందగా ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, భారత జాగృతి రాష్ట్ర కార్యదర్శి అనంతుల ప్రశాంత్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్, రైతుబంధు మండల కోఆర్డినేటర్ దుర్గయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్‌రావు, మాజీ ఎంపీపీ కనకయ్య పరామర్శించిన వారిలో ఉన్నారు.

'ఉద్యమకారుడికి అవకాశం ఇవ్వండి'

చేర్యాల(సిద్దిపేట): జనగామ నియోజకవర్గ బీఆర్‌ఎస్ టికెట్ ఉద్యమకారుడిగా తనకు అవకాశం కల్పించాలని మద్దూరు హైకోర్టు న్యాయవాది, బీఆర్‌ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి జల్లి సిద్ధయ్య కోరారు. ఆదివారం పట్టణకేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యమ సమయంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన తనకు 2004 అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తి అభ్యర్థిగా కేసీఆర్ అవకాశం ఇచ్చారని, అక్కడి సమీకరణల నేపథ్యంలో వెనక్కి తగ్గినట్లు చెప్పారు. టికెట్ కేటాయించాలని అధిష్టానాన్ని కోరినట్లు చెప్పారు. ఆయన వెంట న్యాయవాది వీరమల్లయ్య, నాయకులు లక్ష్మీనారాయణ, బాలయ్య, హరిరాములు, విజయ్‌కుమార్, దుర్గయ్య, మల్లేశం, శ్రీనివాస్, నర్సింహులు, తదితరులు ఉన్నారు.



పారిశుద్ధ్యం..అస్తవ్యస్తం

మండలంలో ఖమ్మంపల్లి గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. మురికి కాలువలు చెత్త చెదారంతో నిండిపోయాయి. దీంతో నీరు ఎక్కడికక్కడ నిలిచి దుర్గంధం వెదజల్లుతుంది. ఇళ్ల మధ్య పేరుకుపోయిన పెంట కుప్పలతో ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.
– కొండపాక(గజ్వేల్)

ముమ్మరంగా ఐఓసీ పనులు

మండలంలోని కిషన్‌నగర్ వద్ద మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో రూ.17 కోట్లతో నిర్మిస్తున్న ఐఓసీ (ఇంటి గ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్) భవన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. వచ్చే నెల 6వ తేదీన ప్రారంభించాల్సి ఉండగా అధికారులు దగ్గరుండి పనులు చేయిస్తున్నారు. – హుస్నాబాద్‌రూరల్





లీకేజీలు అరికట్టరూ..!

మండల పరిధిలోని మెట్టుబండలు స్టేజీ వద్ద ఉన్న ట్యాంకు నుంచి రామంచ, చంద్లాపూర్‌కు తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ఈ పైపులైన్ నిత్యం లీకేజీల మయం అవుతుంది. అధికారులు స్పందించి లీకేజీలను అరికట్టాలని కోరుతున్నారు.
– చిన్నకోడూరు (సిద్దిపేట)

బీజేపీతోనే అన్నివర్గాలకు న్యాయం

సిద్దిపేటకమాన్: బీజేపీతోనే అన్నివర్గాలకు సమన్యాయం జరుగుతుందని అస్సాం ఎమ్మెల్యే అమియా కుమార్ భుయాన్ అన్నారు. ఆదివారం సిద్దిపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులతో కలిసి వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 20 నుంచి 27 వరకు సిద్దిపేట నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నామని తెలిపారు. ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని ఈసారి తెలంగాణలో మోదీ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఉపేందర్, నర్సింహారెడ్డి, నరేష్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అమియా కుమార్ భుయాన్

మరోసారి గెలిపించాలి

రాయపోలు(దుబ్బాక): రానున్న శాసనసభ ఎన్నికల్లో మరోసారి దుబ్బాక నుంచి బీజేపీ అభ్యర్థిని గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని షోలాపూర్ ఎమ్మెల్యే సుభాష్‌చంద్రబోస్ అన్నారు. రాయపోలులో ఆదివారం ప్రభాస్ యోజన కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు మంకిడి స్వామి, నాయకులు చారి, రాజుగౌడ్, సత్యం, వెంకటేశ్‌గౌడ్, నీల స్వామి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను నమ్మొద్దు

గజ్వేల్‌రూరల్: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మాయమాటలతో మభ్యపెట్టే బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని నమ్మొద్దని మహారాష్ట్రలోని వార్ధా ఎమ్మెల్యే పంకజ్ రాజేష్ భోయర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా ఎన్నికలు సమీపిస్తుండడంతో వారిని మరోమారు మోసం చేస్తుందని ఆరోపించారు. అంతకుముందు గజ్వేల్ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కప్పర ప్రసాదరావు, గురువారెడ్డి, పేర్ల శ్రీనివాస్, మహేష్, మనోహర్‌యాదవ్, అశోక్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయి

- ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్/మిరుదొడ్డి(దుబ్బాక): సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని దుబ్బాక, మిరుదొడ్డి మండలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ ఇంజిన్ సర్కార్ పేరుతో ప్రచారం చేసుకుంటున్న బీజేపీతో ప్రజలకు ఒరిగేదేమి లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు డిపాజిట్లు కూడాదక్కవని ఎద్దేవా చేశారు. దుబ్బాకలో గెలిచిన రఘునందన్‌రావు మాటలు తప్ప చేసిందేమి లేదని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి, ఎంపీపీ గజ్జెల సాయిలు, జెడ్పీటీసీ సూకూరి లక్ష్మీలింగం, ఉమ్మడి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, సర్పంచ్ పెద్ది కవితారాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

సమష్టిగా ముందుకు సాగుదాం

తొగుట(దుబ్బాక): నాయకులు, కార్యకర్తలు సమష్టి కృషితో దుబ్బాక గడ్డపై విజయబావుట ఎగరేద్దామని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు చిలువేరి మల్లారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం ఎంపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాకలో విజయం సాధించి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కనకయ్య, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

గజ్వేల్: గజ్వేల్– ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీని నంబర్‌వన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని సంగుపల్లిలో హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రాతినిథ్యంతో మున్సిపాలిటీ రూపురేఖలే మారిపోయాయని చెప్పారు. పట్టణంలో ఇప్పటికే రింగు రోడ్డు పనులు పూర్తికాగా, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు సైతం పూర్తి కావొస్తున్నాయన్నారు. పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బబ్బూరి రజిత, బీఆర్‌ఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు నవాజ్‌మీర, నాయకులు మతిన్, బీరయ్య, స్వామిచారి, తదితరులు పాల్గొన్నారు.



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న నాయకులు

యువత ఓటరుగా నమోదు చేసుకోవాలి

బెజ్జంకి(సిద్దిపేట): 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కరీంనగర్ అదనపు కలెక్టర్, నియోజకవర్గ ప్రత్యేక ఓటు నమోదు అధికారి లక్ష్మీకిరణ్ సూచించారు. బెజ్జంకితో పాటు కల్లెపెల్లిలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆదివారం పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నల్లా వెంకట్‌రెడ్డి, ఆర్ఐ రాజయ్య, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలో ఓటరు నమోదు తీరును గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్ పరిశీలించారు. ఎలా నమోదు చేసుకుంటున్నారన్న విషయాన్ని బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆర్డీఓ బన్సీలాల్ మాట్లాడుతూ 18 ఏళ్ళు నిండిన వారందరూ ఓటు హక్కును కల్గి ఉండేలా అధికారులు, బీఎల్‌ఓలు చూసుకోవాలన్నారు. చనిపోయిన వారి పేర్లను ఓటరు లిస్టులోంచి తొలగించుకోవాలన్నారు. ఏదేని పథకాలకు అర్హులయ్యేందుకు భవిష్యత్తులో ఓటరు గుర్తింపు కార్డు తప్పనిసరి అవసరంగా మారనుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి, ఆర్ఐ సత్యనారాయణ, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.



బెజ్జంకిలో ఓటరు నమోదు వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

చేర్యాల(సిద్దిపేట): పోలింగ్ కేంద్రాలను ఆదివారం జనగామ ఆర్డీఓ మురళీకృష్ణ సందర్శించారు. ఆయా కేంద్రాల వద్ద ఓటరు నమోదుపై ఆరా తీసి పలు సూచనలు చేశారు.



విశేషాలంకరణలో అమ్మవారు

సంతోషిమాతకు ప్రత్యేక పూజలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని సంతోషిమాత ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం 108 కళశాలతో అమ్మవారికి అభిషేకం, రుద్రహవనం, రుద్రహోమం, అన్నపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మంత్రి హరీశ్‌రావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రూ. 50 లక్షల నిధులతో ఆలయంలో అన్ని రకాల పెండింగ్ పనులు పూర్తి చేయాలని పాలకవర్గానికి సూచించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మాంకాల నవీన్‌కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, ఆలయ మాజీ చైర్మన్ కాశీనాథ్, వైదిక నిర్వహణ ఆలయ అర్చకులు పాడిచేటి రామకృష్ణ, ఆలయ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని 14వ వార్డు పరిధిలో పోచమ్మ అమ్మవారికి నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో మంత్రి హరీశ్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

గజ్వేల్‌రూరల్: ప్రజలకు మెరుగైన వైద్యమందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందిన మండల పరిధిలోని అహ్మదీపూర్‌కు చెందిన ఎర్ర స్వప్నకు రూ. 60 వేలు, దర్ని మల్లమ్మకు రూ. 25 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌గౌడ్, అహ్మద్, నిజామొద్దీన్, నరేష్, రామాగౌడ్, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా బోనాలు

చేర్యాల: బోనాలతో మహిళలు

కొండపాక(గజ్వేల్): శ్రావణమాసాన్ని కుకునూరుపల్లిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ తల్లి బోనాలు నిర్వహించారు. అనంతరం వన భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఆసంఘం జిల్లా అధ్యక్షుడు కాచం నవీన్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు స్రవంతి, సంఘ ం నాయకులు ఉప్పల పాండు, గంగిశెట్టి శ్రీనివాస్, ఉప్పల రాజు, అనిల్ పాల్గొన్నారు.

రాంపూర్‌లో..

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని రాంపూర్‌లో ఆదివారం గ్రామ దేవత పోచమ్మకు బోనాలు చేసి ఊరేగింపుగా వెళ్లి సమర్పించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన బంధువులతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.



అ'పూర్వ' సమ్మేళనం

ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

చిన్నకోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1886–87లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా రోజంతా సందడిగా గడిపారు. అనంతరం అంతా కలిసి రంగనాయక సాగర్ రిజర్వాయర్‌ను సందర్శించారు. – చిన్నకోడూరు(సిద్దిపేట)



పూల రాఖీలు.. అదరహో

మండల పరిధిలోని చెలుకలపల్లిలో ఆదివారం మహిళలు ప్రకృతి సిద్ధమైన పూలతో రాఖీలు తయారు చేశారు. మార్కెట్‌లో లభిస్తున్న రాఖీల్లో ప్లాస్టిక్ ఉంటుందని, తక్కువ డబ్బుతో సహజ సిద్ధమైన పూలతో ప్రతి ఏటా రాఖీలు తయారు చేసి సోదరులకు కడతామని మహిళలు తెలిపారు. ప్రతి ఏడాది రాఖీ పండగను ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. – చిన్నకోడూరు(సిద్దిపేట)

సంక్షిప్త వార్తలు

◆ **స్పాట్ అడ్మిషన్లు**

దుబ్బాక: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి సోమవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. మొదటి సంవత్సరం బైపీసీలో ఎస్సీ 9, ఎస్టీ 2, బీసీ2, ఓసీ1, మైనార్టీ1 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

◆ **బాధిత కుటుంబాన్ని ఆదుకోండి**

గజ్వేల్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని సంగుపల్లిలో ఇటీవల మృతిచెందిన భాస్కర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించి మనోధైర్యం కల్పించారు.

◆ **'రాజకీయాల్లో అవకాశం కల్పించాలి'**

కొండపాక(గజ్వేల్): ముదిరాజ్‌లకు రాజకీయాల్లో అవకాశం కల్పించాలని ఆసంఘం మండల అధ్యక్షుడు జిర్ర రాజు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని దుద్దెడ ఎల్లమ్మ తల్లి దేవాలయం ప్రాంగణంలో ఆదివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రకటించిన అసెంబ్లీ టికెట్ల కేటాయింపుల్లో ముదిరాజ్ కులస్తులకు ఒక్క సీటు కేటాయించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, నర్సింలు, కొండల్, భాస్కర్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

◆ **అక్రమ మట్టి తరలింపు అడ్డగింత**

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని వీరన్నపేట పులికుంట నుంచి తీసిన మట్టిని రైతుల పంట పొలాల్లో పోయకుండా ఒక చోట డంప్ చేసి అక్రమంగా ఇటుక బట్టీలకు తరలించడాన్ని శనివారం రైతులు అడ్డుకున్నారు. పోలీసులకు సమాచారం అందించగా వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని జేసీబీ, టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

◆ **వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని టీపీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేసేందుకు డిక్లరేషన్లు ప్రకటిస్తుంటే బీఆర్‌ఎస్ భయపడుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలపై ఉందని అన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు సుంచు రమేష్, సీనియర్ నాయకులు గంధమల్ల యాదగిరి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు కొమ్మూరి రాజు, తదితరులు పాల్గొన్నారు .

◆ **గెలుపే లక్ష్యంగా పనిచేయాలి**

బెజ్జంకి(సిద్దిపేట): మానకొండూర్ నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇంచార్జి నిశాని రామచంద్రం పిలుపునిచ్చారు. మండలంలోని చిలాపూర్‌లో ఆదివారం పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. బహుజనుల అభివృద్ధి కేవలం బీఎస్పీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మంద బాలయ్య, అధ్యక్షుడు నల్లాల శ్రీనివాస్, జోనల్ కన్వీనర్ స్వరూప, నాయకులు పాల్గొన్నారు.

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

కోహెడ(హుస్నాబాద్): కోహెడ, చిన్నకోడూరు సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ చలపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 ఉదయం10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దరఖాస్తులు స్వీకరించి కళాశాలలో ప్రవేశం కల్పిస్తామని చెప్పారు.

◆ **అన్ని వర్గాల అభివృద్ధి**

జగదేవ్‌పూర్(గజ్వేల్): బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి జరుగుతుందని డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తిగుల్‌లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయ పనులను పరిశీలించారు. తమవంతుగా రూ. లక్ష సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతుబంధు మండల కో ఆర్డినేటర్ సుధాకర్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రంగారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు లచ్చిరెడ్డి, ఆంజనేయులు, శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్రాధాన్యం ఇవ్వని పార్టీలకు గుణపాఠం తప్పదు**

కొమురవెల్లి(సిద్దిపేట): ముదిరాజ్‌లకు ప్రాధాన్యం కల్పించని పార్టీలకు గుణపాఠం తప్పదని మత్స్య పారిశ్రామిక జిల్లా డైరెక్టర్ తేలు ఇస్తారి అన్నారు. ఆదివారం అయినాపూర్‌లో సంఘం సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాశం రమేష్, ఉపాధ్యక్షులుగా మల్లం బాలయ్య, కార్యదర్శిగా దండు నర్సింహులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గొల్లపల్లి కిష్టయ్య ఆధ్వర్యంలో ముదిరాజ్‌లకు చట్ట సభల్లో సముచిత స్థానం కల్పించాలని బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రసులాబాద్ ఉపసర్పంచ్ సురేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

◆ **హనుమాన్ యూత్ సేవలు అభినందనీయం**

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రజాసేవలో యువత ముందుండాలని డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి అన్నారు. మండలంలోని తిగుల్‌లో హనుమాన్ యూత్ అసోసియేషన్ 30 వార్షికోత్సవాలను ఆదివారం బాట లక్ష్మీనర్సింహ్మాస్వామి ఆలయం వద్ద ఘనంగా నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోట్టాల మహేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

◆ **మధ్యాహ్న భోజన కార్మికులను ఆదుకోండి**

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మహిళా శ్రామిక జిల్లా నాయకురాలు దాసరి కళావతి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. వంట పాత్రలతో పాటు మెస్ చార్జీలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఆరుట్ల రవి, రమేష్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.